ప్రజాశక్తి
శుక్రవారం 14 నవంబర్ 2025
5
శ్రీ సత్యసాయి

కాంట్రాక్టర్ ప్రోద్బలంతోనే విలేకరులపై అక్రమ ఫిర్యాదు

ప్రజాశక్తి- చిలమత్తూరు

స్థానిక టీడీపీ నాయకుడు నాగరాజు యాదవ్ అతని కుమారుడు హరీష్ యాదవ్ నీచ రాజకీయాలకు తెరతీశారు. ప్రజాశక్తి విలేకరి శంకర్ పై దాడులు చేసి గాయపరిచిన నాగరాజు యాదవ్, అతని కుమారుడిపై పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. దీంతో విలేకరులను లక్ష్యంగా చేసుకున్న టీడీపీ నాయకుడు నాగరాజు యాదవ్ నిస్సిగ్గుగా అమాయకులైన ఎస్సీలను అడ్డం పెట్టి వారిచేత గురువారం అక్రమ ఫిర్యాదు చేయించారు. ఏ రోడ్డు అంశం లో అయితే కథనాలు ప్రచురితమయ్యి విలేకరిపై దాడి ఘటన చోటు చేసుకుందో, అదే రహదారికి ఇసుక తరలిస్తున్న తనపై ప్రజాశక్తి విలేకరి శంకర్ తో మరో పత్రికా విలేకరి దాడి చేశారని ఓ ఎస్సీ వ్యక్తితో ఫిర్యాదు చేయించాడు. ఈ వ్యవహారంతో టిడిపి నాయకుడి కుట్ర బహిర్గమైంది. ప్రజాశక్తి విలేకరి శంకర్‌కి ఫిర్యాదు చేసిన వ్యక్తితో కనీసం పరిచయం కూడా లేదు. ఇక అతనిపై దాడి చేయల్సిన అవసరం ఏముంటుంది? అన్న ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి. ఇప్పటికే ప్రజల్లో అబాసుపాలైన టీడీపీ నాయకుడు నాగరాజు యాదవ్ తనపై కేసు నమోదు కావడం తో కక్ష్య సాధింపు చర్యలకు దిగాడని స్థానికులు విమర్శిస్తున్నారు.

'పట్టు' జారింది...

పట్టు గూళ్లు రాక పోవడంతో బోసిపోయిన మార్కెట్

పట్టుగూళ్లు రాక మార్కెట్ వెలవెల
విడుదల కాని ఇన్సెంటివ్
పట్టించుకోని ప్రభుత్వం
ఇబ్బందుల్లో రైతులు

ప్రజాశక్తి-హిందూపురం

'మాది రైతు ప్రభుత్వం..రైతుల సంక్షేమం మా లక్ష్యం' ఇలా ప్రతి రాజకీయ పార్టీ నాయకుడు అనే మాట. అధికారంలో ఉన్న టిడిపితో పాటు ప్రతి పక్షంలో వైసిపి ప్రతి సమావేశంలోనే చెప్పే మాటలు. రైతుల సంక్షేమమే తన లక్ష్యం అంటు అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నాయుడు పట్టు రైతులను పట్టించుకోలేదు. దీంతో 2019 నుంచి ఇప్పటి వరకు పట్టు రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన ఇన్సెంటివ్ విడుదల చేయలేదు. ఇన్సెంటీవ్ విడుదల చేయాలని పదుల సార్లు ప్రభుత్వ పెద్దలను కలసిన ప్రయోజనం దక్కలేదు. దీంతో పట్టు రైతులు ఆగ్రహించారు. రాష్ట్రంలోనే అతి పెద్ద పట్టు గూళ్ల మార్కెట్ గా ప్రసిద్దిగాంచిన హిందూపురం మార్కెట్‌కు రైతులు బుధవారం ఒక్క లాటు సైతం పట్టు గూళ్లు తీసుకు రాక పోవడంతో మార్కెట్ బోసిపోయింది. గురువారం కేవలం 15 లాట్లు మాత్రమే వచ్చాయి. ఈ నేపథ్యంలో పట్టు రైతు సంఘం నాయకులు జయరామిరెడ్డి, సిద్దారెడ్డి, చైతన్య గంగిరెడ్డి తదితరులు ప్రభుత్వతీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఇటీవల కాలంలో వ్యవసాయ ఉత్పత్తుల ధరలు అమాతంగా పెరగడంతో...రైతులు తక్కువ పెట్టుబడి ఉండే పట్టు సాగుకు ఎక్కువ మక్కువ చూపుతున్నారు. దీంతో పాటు ఉమ్మడి అనంతపురం జిల్లాలో వేరుశెనగ, మొక్కజొన్న ప్రదాన పంటలు. వీటి తరువాత ప్రత్యామ్నాయ పంట ఏదైనా ఉందంటే అది పట్టు సాగు అని చెప్పవచ్చు. హిందూపురం పార్లమెంట్ పరిధిలోని 7 నియోజక వర్గాల్లో ఎక్కువగా పట్టు పంట సాగు జరుగుతుంది. అయితే గత కొన్ని సంవత్సరాలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల పట్టు జారింది. రైతన్నలకు ప్రభుత్వం నుంచి విడుదల కావాల్సిన ఇన్సెంటీవ్ 2019 నుంచి విడుదల కాక పోవడంతో రైతులు ఇన్సెంటీవ్ కోసం పట్టు గూళ్ల మార్కెట్ బంద్ చేసి నిరవదిక దీక్షలు చేపట్టారు. అయినప్పటికి ప్రభుత్వం పట్టు రైతుల ఆవేదనను అర్థం చేసుకోలేదు. ఇన్సెంటివ్ విడుదల చేయలేదు. దీంతో ఇక్కడ పండించిన పట్టును రైతులు కర్నాటక రాష్ట్రానికి తీసుకెళ్లి విక్రయిస్తున్నారు. దీంతో మార్కెట్ చరిత్రలోనే ఎప్పుడు లేని విధంగా బుధశారం స్థానిక మార్కెట్‌కు ఒక్క లాటు పట్టు రాలేదు. దీంతో దీనిపై ఆధారపడిన రీలర్లు, ఇదే పనిని నమ్ముకుని జీవనం చేస్తున్న వేలాది కుటుంబాలకు ఉపాధి లేకుండా పోయింది. హిందూపురం పట్టుగూళ్ల మార్కెట్‌కు ప్రతి రోజు 12 నుంచి 15 టన్నుల పట్టుగూళ్లు వస్తున్నాయి. రోజుకు రూ. 40లక్షల నుంచి 50 లక్షల రూపాయల వరకు లావాదేవీలు జరుగుతున్నాయి. దీంతో ప్రభుత్వానికి గత సంవత్సరం రూ.1.27 కోట్లు ఆదాయం వచ్చింది. ఈ సంవత్సరం ఎప్రిల్ నుంచి అక్టోబర్ వరకు రూ.95లక్షలు ఆదాయం వచ్చింది. దీనికి ప్రతిఫలంగా రైతులు పండిన పంటకు ప్రభుత్వం ప్రోత్సహకంగా సిబికి రూ.10, బైవోల్టీన్‌కు రూ.50 అందిస్తోంది. అయితే ఇది కూడా ఇక్కడ సరిగా ఇవ్వడం లేదు. తెలంగాణలో బైవోల్టీన్‌కు రూ.75 ప్రోత్సహకంగా ఇస్తున్నారు. ఇక్కడ రైతులకు ప్రోత్సహకం క్రింద కేజికు సిబికి రూ.150, బైవోల్టీన్‌కు రూ.200 ప్రభుత్వం అందిస్తే రైతులకు కాస్తా ఉపసమనం లభిస్తుందనిపట్టు రైతు సంఘం నాయకులు, పట్టు రైతులు అంటున్నారు. అదేవిధంగా రీలర్లుకు ఒక కేజి పట్టుదారం తయారు చేసి విక్రయిస్తే దానికి ప్రోత్సాహకం క్రింద రూ. 130 ఇస్తున్నారు. అయితే ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం మల్టీయన్ రీలర్లకు కేజీకి రూ.130 నుండి 200రూపాయల వరకు, చర్కా రీలర్లకు రూ.35 నుండి 100రూపాయలకు పెంచి ఇవ్వాలని వారు డిమాండ్ చేస్తున్నారు. రీలర్లు ఎక్కువ శాతం ముస్లీం మైనార్టీలకు చెందిన వారు వున్నారని అందరికి మైనార్టీ కార్పొరేషన్ ద్వారా రీలింగ్ యూనిట్లు, ట్విస్టింగ్ యూనిట్లు ఏర్పాటు చేసుకోవడానికి రాయితీ రుణాలు ఇవ్వాలని. సోలార్ సిస్టమ్ ద్వారా యూనిట్ల బాయిలర్లకు విద్యుత్ సరఫరా కల్పించాలని కోరుతున్నారు. పట్టు రైతులతో పాటు రీలర్ల సమస్యలు పరిష్కరిస్తే పట్టుకు హిందూపురంలో పూర్వ వైభవం వస్తుందని రైతులు, రీలర్లు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

రూ.80 కోట్ల మేర నిలచిన ఇన్సెంటీవ్‌లు

రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 7 పట్టు గూళ్ల మార్కెట్లు ఉన్నాయి. ఇందులో హిందూపురం, పలమనేరు మార్కెట్లు పెద్దవి. దీంతో పాటు అనంతపురం జిల్లాలో కదిరి, ధర్మవరం, చిత్తూరు జిల్లాలో కుప్పం, మదనపల్లి మార్కెట్లు ఉన్నాయి. ఈ మార్కెట్‌లో పట్టు గూళ్లు విక్రయించిన పట్టు రైతులకు ఒక కేజి బైవోల్టీన్ పట్టు గూళ్లకు రూ.50, సిబికు రూ.10 ఇన్సెంటీవ్ ఇస్తుంది. దీంతో పాటు రీలర్లకు ఒక కేజి దారం తీసి విక్రయిస్తే వారికి రూ.150 ఇన్సెంటీవ్ ఇస్తుంది. ప్రభుత్వం పట్టు రైతులకు ఇవ్వాల్సిన ప్రోత్సహకాలు 2019 ఆగష్టు నుండి ఇప్పటి వరకు విడుదల చేయలేదు. ప్రభుత్వ లెక్కల ప్రకారం ఒక్క హిందూపురం పట్టు గూళ్ల మార్కెట్‌లోనే దాదాపు రూ.40కోట్లు, రాష్ట్ర వ్యాప్తంగా సుమారు రూ.80 కోట్లు పట్టు రైతులకు, రీలర్లకు ఇన్సెంటీవ్ రావాల్సి ఉంది. రైతు ప్రభుత్వం అని చెప్పుకునే టిడిపి ప్రభుత్వం పట్టు రైతులను ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలు పెద్ద ఎత్తున వినపిస్తున్నాయి. గత వైసిపి ప్రభుత్వం, ప్రస్తుత టిడిపి ప్రభుత్వం రైతులకు,రీలర్లకు ఇచ్చే ఇన్సెంటీవ్‌లను ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నాయని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

చరిత్రలో ఎప్పుడూ లేదు

హిందూపురం పట్టు గూళ్ల మార్కెట్‌కు చరిత్రలో పట్టుగూళ్లు రాని పరిస్థితి ఎప్పుడూ లేదు. ప్రభుత్వం పట్టు రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే ఈ పరిస్థితి నెలకొంది. ఇప్పటి వరకు బకాయి ఉన్న ప్రోత్సాహకాలు అందిచాలి. రైతులకు అందిస్తున్న ప్రోత్సాహకం పెంచాలి. లేని పక్షంలో అన్ని సంఘాలను కలుపుకుని పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తాము.

జయరామిరెడ్డి,
పట్టు రైతు సంఘం నాయకులు

ఇలాగే కొనసాగితే రోడ్డున పడతాం

హిందూపురం పట్టుగూళ్ల మార్కెట్ నమ్ముకుని 160 మంది పట్టు రీలర్లు, దాదాపు 300 మంది చరఖా రీలర్లు జీవనం చేస్తున్నాము. మాతో పాటు ఇదే వృత్తిని నమ్ముకుని దాదాపు వెయ్యి కుటుంబాలు జీవనం చేస్తున్నాయి. సకాలంలో పట్టుగుళ్లు లభించకపోతే అందరికీ ఉపాధి లేక కుటుంబాలన్నీ రోడ్డున పడాల్సి వస్తుంది. ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలి.

ముస్తఫా,
రీలర్ల అసోసియేషన్ కార్యదర్శి

ప్రతి నెలా వివరాలు అందిస్తున్నాం

హిందూపురం మార్కెట్‌లో పట్టును విక్రయించిన రైతుల వివరాలను ఏరోజుకు ఆరోజు పూర్తి వివరాలను ప్రభుత్వానికి నివేదికలను అందజేస్తాం. దీంతో పాటు ఇన్సెంటీవ్ విడుదల చేయాలని అధికారులను కోరు తున్నాము. 2019 నుంచి బకాయిలు రావాల్సి ఉంది.

హంపయ్య,
మార్కెట్ అధికారి

విధి నిర్వహణలో అప్రమత్తత అవసరం : కలెక్టర్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

పుట్టపర్తి లో ఏర్పాటు చేస్తున్న ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూమ్ లో విధుల నిర్వహణపై సిబ్బంది అందరూ అవగాహన కలిగి ఉండాలని అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, ఎస్పీ సతీష్ కుమార్ పేర్కొన్నారు. సత్యసాయి జయంతి ఉత్సవాల నేపథ్యంలో ఏర్పాటు చేయమన్న ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూమ్ లో విధుల నిర్వహణపై గురువారం పుట్టపర్తి లోని గణేష్ సర్కిల్ వద్ద ఉన్న సాయి ఆరామంలో వివిధ శాఖల అధికారులు, పోలీసు అధికారులకు ఒకరోజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ కంట్రోల్ రూమ్ ప్రధాన ఉద్దేశ్యం ప్రజా భద్రతను మరింత మెరుగుపరుస్తూ యాత్రికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడటమేనని అన్నారు. కమాండ్ కంట్రోల్ రూమ్ లో 24-7 ప్రకారం విధులు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సీసీటీవీ ఫీడ్ మరియు డ్రోన్ సహాయంతో సేకరించిన సమాచారాన్ని ఆధారంగా గుర్తించిన సమస్యలను తగిన ప్రతిస్పందన బృందాలకు (భద్రత, వైద్య, తదితర) స్వయంచాలకంగా బదిలీ చేయడం, కమ్యూనికేషన్‌ను క్రమబద్ధీకరించడం, సత్వర, సమర్ధవంతమైన చర్యలు తీసుకునేలా ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. మొత్తం 176 సీసీటీవీ కెమెరాలు, 8 డ్రోన్లను ఏర్పాటు చేస్తున్నారని, సుమారు 100 మంది సిబ్బందితో మూడు షిఫ్టులుగా అధికారులు విధులు నిర్వహించాలని కలెక్టర్, ఎస్పీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ఆర్డీవో సువర్ణ, డీఎఫ్ఒ చక్రపాణి, వివిధ శాఖల అధికారులు, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

దారి దోపిడీ యత్నం

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండల కేంద్రంలో ఎన్టీఆర్ సర్కిల్లో విహాన్ మొబైల్ షాప్ నిర్వాహకుడు, గుడిపల్లి గ్రామ నివాసి ఎస్ ఆర్ సురేష్ పై బుధవారం రాత్రి 9 గంటల సమయంలో కారం పొడి చల్లి దారిదోపిడికి ప్రయత్నం చేసిన ఘటన చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు సురేష్ ఆరు సంవత్సరాలుగా మండల కేంద్రంలో మొబైల్ షాప్ సేల్స్ అండ్ సర్వీస్, ఆధార్ కార్డుతో మనీ ట్రాన్స్ఫర్ చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ప్రతిరోజు లాగా బుధవారం రాత్రి ఎనిమిది గంటల పైన షాపు మూసి సొంత గ్రామానికి వెళుతుండగా పాపిరెడ్డి పల్లె అవతల చీకటిలో ముగ్గురు వ్యక్తులు పల్సర్ ఎన్ఎస్ బైక్ పై వచ్చి రమేష్‌ను అడ్డగించారు. కారంపొడితో దాడి చేసి అతని వద్ద ఉన్న సుమారు ఒకటిన్నర లక్ష రూపాయలు, లక్ష వరకు విలువచేసే మొబైల్ ఫోన్లు దొంగలించడానికి ప్రయత్నించారు. ఆ సమయంలో రమేష్ వాహనం నుంచి కిందికి పడిన వెంటనే చేతికి అందిన రాయిని తీసుకుని దుండగులపై విసిరాడు. దీంతో ఒక వ్యక్తి గాయపడటంతో వారు ఆధ్యాసలో ఉండగా రమేష్ తన వాహనాన్ని అక్కడే వదిలేసి సమీపంలోని పాపిరెడ్డి పల్లె ఎస్సీ కాలనీలోకి పరిగెత్తాడు. అదే సమయంలో పాలవ్యాను రావటంతో అది చూసిన వారి వాహనంలో వెళ్లిపోయారు. దంతో కొద్దిపాటి గాయాలతో తాను బయటపడినట్లు బాధితుడు రమేష్ తెలిపాడు. ఈసందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ పాపిరెడ్డి పల్లి సమీపంలోని కియా అనుబంధ సంస్థల్లో గుడిపల్లి గ్రామం నుంచి సుమారు 50 మంది పైబడి మహిళలు పనిచేస్తున్నారని వీరు రాత్రి 8 గంటల సమయంలో కంపెనీ సమయం అయిపోయిన తర్వాత గ్రామానికి నడుచుకొని వెళ్తారని చెప్పారు. దారి దోపిడీ దొంగలు మహిళలపై దాడి చేసే అవకాశం ఉందనిపోలీసులు గట్టి గస్తీ ఏర్పాటు చేసి దారి దోపిడీ దొంగల ఆగడాలను అరికట్టాలని కోరుతున్నారు.

తనపై జరిగిన దాడిని వివరిస్తున్న బాధితుడు సురేష్

పుట్టపర్తిలో సత్యసాయి చిల్డ్రన్స్ పార్క్ ప్రారంభం

పార్కును ప్రారంభిస్తున్న ముఖ్య అతిథులు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

సత్యసాయిబాబా శతజయంతిని పురస్కరించుకుని ఆధ్యాత్మిక కేంద్రం పుట్టపర్తిలో జోయా లుకాస్ వారి సహకారంతో 1.20 కోట్లుతో నిర్మించిన శ్రీ సత్య సాయి చిల్డ్రన్స్ పార్క్ ను రాష్ట్ర బీసీ సంక్షేమ జౌళి శాఖ మంత్రి సవిత, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జోయాలూకాస్ ఎమ్‌డి జాలి చాయ్ లూకాస్, సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ రత్నాకర్, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్, ఎస్పీ సతీష్ కుమార్, కేరళ మాజీ డీజీపీ శంకర్ రెడ్డి, సౌభాగ్య రాణి తదితరులు హాజరయ్యారు. చిత్రావతి నది ఒడ్డున పిల్లలు, పెద్దలకు ఆహ్లాదాన్ని అందించే ఈ పార్క్ నిర్మించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పార్క్ లో జిమ్, వాకింగ్ ట్రాక్, పిల్లల ఆటస్థలం, వాటర్ ఫౌంటెన్ వసతులు ఉన్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బాబా మీద భక్తితో, ప్రజలకు సేవ చేయాలనే మంచి ఆలోచనలతో అడిగిన వెంటనే పార్క్ నిర్మాణానికి ముందుకు వచ్చిన జోయా లూకాస్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. బాబా జన్మదిన వేడుకలు ప్రారంభోత్సవం రోజున పిల్లలు పెద్దలకు ఆహ్లాదాన్ని అందించే శ్రీ సత్యసాయి చిల్డ్రన్ పార్క్ ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. మంత్రి సవిత మాటాడుతూ సీ యస్ ఆర్ (కార్పొరేట్ సామాజిక బాధ్యత) నిధులతో సత్యసాయి బాబా శత జయంతిని పురస్కరించుకుని జోయా లూకాస్ సంస్థ ఈ అద్భుతమైన పార్క్ నిర్మించడం సంతోషంగా ఉందని, దీనిని ముందుండి నడిపించిన పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరను మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డిని అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా బాబా వారి జయంతిని రాష్ట్ర పండుగగా గుర్తించి, మంత్రుల కమిటీని నియమించి, రాష్ట్ర ప్రభుత్వం, మరియు సత్యసాయి ట్రస్టు పరస్పర సహకారంతో చరిత్రలో నిలిచిపోయే రీతిలో శత జయంతి ఉత్సవాలు నిర్వహిస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్కింగ్ ప్రదేశాల ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

సత్య సాయి బాబా శత జయంతి ఉత్సవాల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాలతో పుట్టపర్తిలో ఏర్పాటు చేస్తున్న పార్కింగ్ ప్రదేశాలలో వేగవంతంగా అధికారులు పనులను పూర్తి చేయిస్తున్నారు. వివిధ పార్కింగ్ ప్రదేశాలలో రహదారి అభివృద్ధి, తాగునీటి ట్యాంకర్లు, తాత్కాలిక మరుగుదొడ్లు, సూచిక బోర్డు ఏర్పాటు, ఇతరత్రా పనులను వేగవంతంగా పూర్తి చేసేందుకు ఆయా శాఖల అధికారులు సిబ్బంది చర్యలు తీసు కుంటున్నారు. అలాగే పారిశుధ్య పనులను కూడా చేస్తున్నారు. ఈ నేపథ్యంలో జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ఆర్డీవోలు సువర్ణ, వివిఎస్ శర్మ,పార్కింగ్ గురువారం ఆయా ప్రదేశాలకు వెళ్లి పరిశీలించారు.

పార్కింగ్ ఏర్పాట్లపై అధికారులతో చర్చిస్తున్న జాయింట్ కలెక్టర్

ఉత్తమ వ్యక్తిత్వం అలవర్చుకోవాలి

ప్రజాశక్తి-హిందూపురం

ఏవైనా సమస్యలు ఎదురైనప్పుడు మానసికంగా కృంగిపోకుండా మంచి వ్యక్తిత్వంతో ముందుకు వెళితే మానసిక స్థైర్యం లభిస్తుందని మానసిక కౌన్సిలర్ వి. ధాత్రి విద్యార్థినులకు సూచించారు. గురువారం పట్టణంలోని ఎన్ఎస్ పి ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల యన్ యస్ యస్, రెడ్ రిబ్బన్ క్లబ్ విభాగాలు సంయుక్తంగా మానసిక ఆరోగ్యం పై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. ప్రగతి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా బెంగళూరులోని జైన్ విశ్వవిద్యాలయ సైకాలజీ విభాగపు పూర్వ విద్యార్థి, మానసిక కౌన్సిలర్ వి. ధాత్రి పాల్గొని విద్యార్థినులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ధాత్రిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ జి. వెంకటేసులు, ఎన్ఎస్ఎస్ పోగ్రాం అధికారి రంగనాయకులు, రెడ్ రిబ్బన్ క్లబ్ ఇన్‌ఛార్జి అమరేష్, అధ్యాపకులు అనూష, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-హిందూపురం

భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవడంతో పాటు హిందూపురం రూరల్ మండలం తూమకుంట, గోళాపురం శ్రామిక వాడలో పనిచేస్తున్న కార్మికులను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించే విధంగా చర్యలు తీసుకోవాలని నాయకులు కోరారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో కార్మిక శాఖ కమిషనర్ ను కలిసి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతిని అందించారు. అదేవిధంగా కార్మిక శాఖ మంత్రి అందుబాటులో లేకపోవడంతో మంత్రి సెక్రటరీని కలిసి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతిని అందించారు. ఈ సందర్భంగా యుటియుసి రాష్ట్ర కార్యదర్శి ఏ శ్రీనివాసులు మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న లక్షలాదిమంది భవన నిర్మాణ కార్మికులకు కార్మిక శాఖ తరపున గుర్తింపు కార్డులివ్వాలన్నారు. కార్మిక శాఖ సాఫ్ట్వేర్ అప్డేట్ చేయకపోవడంతో గుర్తింపు కార్డులు పొందడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. గుర్తింపు కార్డు ఉంటే కార్మిక సంక్షేమ బోర్డు నుంచి కార్మికులకు సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. ఆధార్ కార్డు సక్రమంగా లేకపోతే లేబర్ కార్డు రిజిస్టర్ కావడం లేదన్నారు. అందువల్ల భవన నిర్మాణ కార్మికుల కోసం ప్రత్యేక ఆధార్ క్యాంప్ ఏర్పాటు చేసి ప్రతి ఒక్కరికి గుర్తింపు కార్డులు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా హిందూపురం రూరల్ మండలం తూమకుంట, గోళాపురం పారిశ్రామిక వాడలో ఉన్న వివిధ పరిశ్రమల్లో 3 సంవత్సరాలు పైబడిన కార్మికులందరినీ శాశ్వత ఉద్యోగులుగా గుర్తించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎరుకల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు శంకరయ్య, వివిధ సంఘాల నాయకులు నాగరాజు, నారాయణ, అబ్దుల్ ఆలం, నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణ అన్యాయం

ప్రజాశక్తి-హిందూపురం

కూటమి ప్రభుత్వం అనాలోచితంగా చేపట్టిన మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను ఉపసంహరించుకునే వరకు ఆందోళన కొనసాగిస్తామని వైసిపి విద్యార్థి సంఘం నాయకులు పేర్కొన్నారు. వైసిపి యువజన విభాగం, విద్యార్థి విభాగం అద్వర్యలో సేవామందిర్ వద్ద ఉన్నా ఎన్‌లైట్ కళాశాలలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మనోజ్ జులియేట్, కదిరేష్ మాట్లాడుతూ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేసి పేదలకు వైద్య విద్యను దూరం చేయాలని కూటమి ప్రభుత్వం చూస్తోందన్నారు. కోట్లాది మంది పేద ప్రజలకు ఉచిత వైద్యం అందించే వైద్యకళాశాలల కోసం రూ.5వేల కోట్లు ఖర్చు చేయలేరా అని ప్రశ్నించారు. వైద్యకళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రజలందరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యువజన, విద్యార్థి సంఘాల నాయకులు బెన్నీ, సుమన్, బాలరాజు, సౌరభ్ హనోక్, సంపత్ తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రేమసదన్‌కు విరాళం

ప్రజాశక్తి-హిందూపురం

పెనుగొండ మండలం అడగాకులపల్లి గ్రామానికి చెందిన కొడిపల్లి గోవర్ధన్ రెడ్డి పట్టణంలోని శ్రీ సత్య సాయి ప్రేమ సదన్ కు రూ. 1 లక్ష విరాళం అందజేశారు. తన కుమారుడు శ్రీ వెన్ రెడ్డి ప్రథమ జన్మదినాన్ని పురస్కరించుకొని సాయి సదన్ లో ఉన్న చిన్నారుల నడుమ జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. అదేవిధంగా అక్కడ ఉన్న చిన్నారులు అందరికీ అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం సోమందేపల్లి పట్టణంలోని శివ నగర్ లో వెలసిన అయ్యప్ప స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆలయ అభివృద్ధి కోసం రూ. 30 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గోవర్ధన్ రెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

'పురం'లో ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-హిందూపురం

ఉమ్మడి అనంతపురం జిల్లాలోని పెద్ద పట్టణాలోల ఒకటిగా ఉన్న హిందూపురంలో ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేయాలని ఎఐఎస్‌బి జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూపురం నియోజకవర్గ పరిధిలోని హిందూపురం పట్టణంతోపాటు, రూరల్, లేపాక్షి, చిలమత్తూరు మండలాలు ఉన్నాయన్నారు. ఆయా ప్రాంతాలకు చెందిన అనేకమంది విద్యార్థులతో పాటు పరిగి, సోమందేపల్లి, మండలాల నుండి కూడా విద్యార్థులు డిగ్రీ చదువుకోవడానికి హిందూపురం పట్టణానికి వస్తుంటారని తెలిపారు. అయితే హిందూపురం పట్టణంలో ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాల లేకపోవడంతో ఎంతో మంది పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. హిందూపురంలో ప్రభుత్వ బాలుర డిగ్రీ డిగ్రీ కళాశాల కళాశాల లేకపోవడంతో ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో వేలాది రూపాయల ఫీజులు కట్టలేక ఎంతోమంది విద్యార్థులు ఇంటర్మీడియట్ పూర్తి చేసుకుని ఇతర రాష్ట్రాలకు వలసలు వెళ్లి కూలి పనులు చేస్తున్నారని వాపోయారు. నియోజకవర్గ విద్యార్థుల విద్యాభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని హిందూపురం పట్టణంలో ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాలను ఏర్పాటు కోరారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్‌బి నాయకులు పవన్ కుమార్, గోపి, శశి, భరత్ రెడ్డి, ఉపేందర్ రెడ్డి, రఘు, వినోద్, ఉమేష్, కల్యాణ్, ప్రేమ్ బాలు, వేణు, సాయి పవన్ తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వాల్మీకుల 'ఎస్టీ' కల నెరవేరుతుంది

ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ప్రభుత్వ విప్ కాలవ

ప్రజాశక్తి-గుడిబండ

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలన్న దశాబ్దాల కల త్వరలోనే నెరవేరుతుందని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు. వాల్మీకులను అగ్రస్థానంలో నిలిపింది టిడిపి ప్రభుత్వమేనని తెలిపారు. వాల్మీకి సామాజికవర్గం ఆధ్వ ర్యంలో గుడిబండలో ఏర్పాటు చేసిన వాల్మీకి విగ్రహాన్ని గురువారం ఆవిష్కరించారు. ముఖ్య అతిథు లుగా ఎంపీ అంబికాతో పాటు రాష్ట్ర ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి హాజరయ్యారు. అతిథులకు వాల్మీకి ప్రజలు, టిడిపి నాయకులు ఘన స్వాగతం పలికారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాల మధ్య మహిళలు జ్యోతులు మోసుకొని ఊరేగింపుగా వెళ్లి పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న వాల్మీకి విగ్రహం వద్దకు చేరుకున్నారు. అతిథులు వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం ఎమ్మెల్యే రాజు అధ్యక్షతన ఏర్పాటుచేసిన సమావేశంలో ఎంపీ అంబికా మాట్లాడుతూ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చడానికి తాము దశాబ్దల కాలంగా ఎన్నో పోరాటాలు, ధర్నాలు చేశామని, ఆ కల తొందరలోనే నెరవేరుతుందని అభిప్రాయపడ్డారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి వినతి మేరకు తాగునీటి శుద్ధ జల ప్లాంట్ ఏర్పాటుకు నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. వాల్మీకి భవనం నిర్మాణానికి రూ. 10 లక్షలు మంజూరు చేస్తానని తెలిపారు. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చడానికి తాను అనేక పోరాటాలు చేశానని, కూటమి ప్రభుత్వం తమ వర్గానికి అనుకూలంగా ఉండటమే గాక ఎస్టీ జాబితాలో చేర్చడానికి సిద్ధంగా ఉందన్నారు. ప్రతి గ్రామంలో వాల్మీకి విగ్రహాలు ఏర్పాటు చేసేందుకు వాల్మీకి ప్రజలు కృషి చేయాలన్నారు. ఎమ్మెల్యే ఎంఎస్.రాజు మాట్లాడుతూ వాల్మీకులకు ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా అందిస్తామన్నారు. మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి మాట్లాడుతూ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌మూర్తి మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని చెరువులను నింపడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో వక్కలిగ కార్పొరేషన్ ఛైర్మన్ లక్ష్మీనారాయణ, టిడిపి మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, సింగిల్‌విండో అధ్యక్షులు మద్దనకుంటప్ప, నాయకులు శివకుమార్, దుర్గేష్, మంజునాథ్, మోహన్, మాధవరావు, ఈశ్వరప్ప, పాండురంగప్ప, లక్ష్మీనారాయణ, ఎంపిటిసి శశిధర్, చిగతుర్పి సర్పంచి హనుమంతరాయప్ప, కరుణాకర్, జనార్ధన్, నాగు, తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ,పక్కన కాలవ, రాజు

కార్యకర్తలే టిడిపి బలం : మంత్రి

ప్రజాశక్తి-పెనుకొండ

కార్యకర్తలే టిడిపికి కొండంత బలమని మంత్రి సవిత తెలిపారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో గురువారం నియోజకవర్గంలోని 5 మండలాల పార్టీ అధ్యక్షులు, క్లస్టర్, యూనిట్, బూత్, గ్రామ, వార్డు, బూత్ లెవల్ కమిటీల సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మంత్రి సవిత, జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజనప్ప హాజరై వారి చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ముందుగా వారు పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ శ్రేణులతో కలిసి కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. కార్యాలయంలో టిడిపి జెండాను ఆవిష్కరించారు. మంత్రి మాట్లాడుతూ పార్టీని నమ్ముకున్న కార్యకర్తలకు తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామన్నారు. కొందరికి పదవులు వచ్చాయని, మరికొందరికి రానున్న రోజుల్లో వస్తాయన్నారు. ఎల్లప్పుడూ ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలు విని వాటి పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. ప్రతిపక్ష పార్టీల అసత్య ప్రచారాలను సోషల్ మీడియాలో తిప్పికొట్టాలని సూచించారు. మండల, గ్రామ, వార్డు, బూత్ లెవల్ కమిటీలు సమన్వయంతో పని చేసి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వందశాతం విజయం సాధించేలా పని చేయాలన్నారు. కార్యక్రమంలో సగర కార్పొరేషన్ ఛైర్మన్ వెంకటరమణ, రాష్ట్ర స్థాయి డైరెక్టర్లు కేశవయ్య, శ్రీనివాసులు, నారాయణస్వామి, ఈశ్వర్‌ప్రసాద్, శ్రీరాములుయాదవ్, రఘువీరా చౌదరి, త్రివేంద్ర, బాబులురెడ్డి, మంజునాథ్, కృష్ణమూర్తి, షౌకత్, పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారం చేస్తున్న మంత్రి సవిత, పార్టీ జిల్లా అధ్యక్షులు

పలువురు టిడిపిలో చేరిక

పరిగి : మండలంలోని కాలువపల్లికి చెందిన పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు గురువారం పెనుకొండ పట్టణంలోని మంత్రి సవిత కార్యాలయంలో మండల కన్వీనర్ ఎస్ఎన్.గోవిందరెడ్డి, గంగాధర్ ఆధ్వర్యంలో టిడిపిలో చేరారు. వారికి మంత్రి టిడిపి కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. మంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై వీరు టిడిపిలో చేరారన్నారు. పార్టీలో ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బాలాజీ, వెంకటేష్, అశ్వర్థప్ప, ఆంజనేయులు, శంకరప్ప, దొడ్డయ్య, తిమ్మయ్య, శివప్రసాద్, మల్లికార్జున, నాగేశ్వరరావు, ముద్దయ్య పాల్గొన్నారు.

వైద్య కళాశాలల ప్రయివేటీకరణ ఆపాలి : వైసిపి

ప్రజాశక్తి-అమరాపురం

వైద్య కళాశాలల ప్రయివేటీకరణ నిర్ణయాన్ని కూటమి ప్రభుత్వం తక్షణం ఉపసంహరించుకోవాలని వైసిపి నాయకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ గురువారం మండలంలోని బసవనపల్లి గ్రామంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప ముందుగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వ అరాచక పాలసీని ప్రజలకు వివరించి సంతకాలు సేకరించారు. వైద్య కళాశాలల ను ప్రభుత్వ ఆధీనంలోనే నిర్వహించాలని డిమాండ్ చేశారు. లేనిచో ప్రజా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా టిడిపికి చెందిన బోయ జయన్న ఈరలక్కప్ప సమక్షంలో వైసిపిలో చేరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ త్రిలోక్, ఎంపిపి ఈరన్న, వైస్ ఎంపిపి కృష్ణమూర్తి, సర్పంచి నరసింహప్ప, ఎంపిటిసి నరసింహమూర్తి, నాయకులు శివకుమార్, శివన్న, కృష్ణారెడ్డి, నాగరాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గాండ్లపెంటలో సంతకాలు సేకరిస్తున్న వైసిపి నాయకులు

గాండ్లపెంట : వైద్య కళాశాలల ప్రయివేటీకరణ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ వైసిపి గ్రామ కన్వీనర్ భోగాదిరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక వైఎస్ఆర్ విగ్రహం వద్ద కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ పిపిపి విధానాన్ని రద్దు చేసేంత వరకూ ప్రజలతో కలిసి పోరాడు తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సూర్యనారాయణరెడ్డి, నరసింహులు, మహమ్మద్ ఇక్బాల్, అజీమ్, మైనుద్దీన్, నాగరాజు, ఆటో బాబు, నటరాజ్, రవీంద్రారెడ్డి, పాల్గొన్నారు.


సచివాలయంలో ఉద్యోగులు లేక ఖాళీగా ఉన్న కుర్చీలు

సచివాలయం వెలవెల.. ప్రజలు విలవిల..!

అమరాపురం : మండల కేంద్రమైన అమరాపురం సచివాలయం-2లో సిబ్బంది పనివేళల్లో కూడా అందుబాటులో ఉండడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఇందుకు ఈ చిత్రమే నిదర్శనం. ప్రజలు వివిధ పనులపై సచివాలయం వెళ్లగా కార్యాలయం తలుపు తెరిచి ఉన్నా ఏ ఒక్కరూ సీటులో కనిపించలేదు. ఖాళీ కుర్చీలు దర్శనమిస్తుంటే తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 3 గంటల పాటు వేచి చూశానని ఏ ఒక్క ఉద్యోగి అందుబాటులోకి రాలేదని స్థానికుడు మహబూబ్‌బాషా వాపోయడు. ఉన్నతాధికారులు స్పందించి సచివాలయ సిబ్బంది పనివేళల్లో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజాశక్తి-కదిరి అర్బన్

వైసిపిది నీచమైన చరిత్ర

ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్

జగన్ హయాంలో ప్రభుత్వ వైఫల్యాలు, తప్పులను ప్రశ్నిస్తే శవాలుగా మార్చిన నీచమైన చరిత్ర వైసిపిది అని ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ తీవ్రస్థాయిలో విమర్శించారు. 'ఎవర్ని చంపడానికి మీకు అధికారం ఇవ్వాలి.. ఇంకా ఎవరినైనా టార్గెట్ చేశారా..? చంపేసి ఎన్నికల్లో సానుభూతి పొందడానికి ప్రయత్నాలు చేస్తున్నారా'.. అని సూటిగా ప్రశ్నించారు. వైసిపికి పేదల ఆరోగ్యం గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. సిఎం సహాయ నిధి ద్వారా 41 మందికి మంజూరైన రూ. 46 లక్షల విలువ చేసే చెక్కులను ఎమ్మెల్యే గురువారం పట్టణంలోని తన కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసిపి అధినేత జగన్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. జగన్‌కు అధికార ధ్యాస తప్ప ప్రజా సమస్యలు పట్టవన్నారు. ఆ పార్టీ నాయకులు వారి శ్రేణులకు మద్యం తాపి రోడ్లపైకి పంపి ధర్నాలు చేయిస్తున్నారని విమర్శించారు. వైసిపి జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ ఇష్టారాజ్యంగా మాట్లాడడం తగదన్నారు. ఆమె కూడా ఫ్రీ బస్సులో ప్రయాణించవచ్చునని, అంతేగాని పదేపదే అబద్ధాలు చెప్తే నిజాలు కావన్నారు. కరోనా సమయంలో ఉపాధ్యాయులను మద్యం షాపుల వద్ద క్యూలో నిలబెట్టిన ఘనత, పిపి కిట్లు అడిగినందుకు వైద్యులను చంపేసిన చరిత్ర, అక్రమ మద్యంతో ప్రజల జీవితాలతో చెలగాటం ఆడిన నీచమైన చరిత్ర వైసిపిదే అన్నారు. మీ అకృత్యాలను తలచుకుంటే ప్రజలు నిద్రలో కూడా ఉలిక్కిపడతారన్నారు. కూటమి ప్రభుత్వం సమాజ హితం కోసం పని చేస్తుందన్నారు. పిపిపి విధానం వల్ల 10 మెడికల్ సీట్లు పెరుగుతాయన్న విషయం తెలుసుకోవాలన్నారు. ఇకనైనా వైసిపి అధినేత, నాయకులు చెత్త ఆలోచనలు, చెత్త మాటలు మానుకోవాలని హితవు పలికారు.

బీమా పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కందికుంట

కార్యకర్త కుటుంబానికి బీమా పత్రాలు అందజేత

కార్యకర్త రూ. 100 చెల్లించి సభ్యత్వం పొందితే రూ. 5 లక్షల బీమా కల్పిస్తున్న ఏకైక పార్టీ టిడిపి అని ఎమ్మెల్యే తెలిపారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన మండలంలోని పట్నం గ్రామానికి చెందిన కార్యకర్త జెరిపిటి లక్ష్మన్న కుటుంబానికి రూ. 5 లక్షల బీమా మంజూరైందన్నారు. బీమా పత్రాలను లక్ష్మన్న భార్య రత్నమ్మకు అందజేశారు.

పేదల సొంతింటి కల సాకారం చేస్తాం : మంత్రి

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

కూటమి ప్రభుత్వం పేదల సొంతింటి కల సాకారం చేస్తుందని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. నియోజక వర్గంలో ఇకపై ఇల్లు లేని పేదలు ఒక్కరు కూడా ఉండకూడదనేది తమ లక్ష్యం అన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పిఎంఎవై) పథకం కింద గురువారం మంత్రి పట్టణంలో నూతన గృహాలకు భూమిపూజ, గృహాల పంపిణీ, ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. స్థానిక సిఎన్‌బి ఫంక్షన్ హాల్ సమీపంలోని శివాలయం వద్ద బెనిఫిషరీ లెడ్ కన్‌స్ట్రక్షన్ గృహాలకు భూమిపూజ చేశారు. అలాగే నూతనంగా నిర్మించిన గృహాలను ప్రారంభించారు. పిఎంఎవై కింద పట్టణంలో 945 గృహాలకు భూమిపూజ చేయగా, 19 మంది లబ్ధిదారులు ఇప్పటికే ఇళ్లు నిర్మించుకున్నారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా 21.50 లక్షల ఇళ్లను కేంద్ర ప్రభుత్వం ఎపికి కేటాయిస్తే, అప్పటి సిఎం జగన్ మాకు ఇళ్లు అవసరం లేదని 2 లక్షల ఇళ్లను తిరస్కరించారన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రతి గ్రామంలో, పట్టణంలో పేదలందరికీ గృహాలు కేటాయించడంతో పాటు సంక్షేమ పథకాల ద్వారా నిజమైన లబ్ధిదారులకు చేరేలా పని చేస్తుందన్నారు. పట్టణానికి రూ. 40 కోట్లతో చేనేత క్లస్టర్ మంజూరైందని, అది ఏర్పాటైతే 22వేల మందికి ఉపాధి కలుగుతుందన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ సురేష్‌బాబు, మున్సిపల్ కమిషనర్ సాయికృష్ణ, ఈఈ లక్ష్మీనారాయణమ్మ, డీఈ వెంకటేశులు, ఏఈ చిరంజీవి, హౌసింగ్, సచివాలయం సిబ్బంది, కూటమి నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

గాండ్లపెంటలో సంతకాలు సేకరిస్తున్న వైసిపి నాయకులు

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి-కొత్తచెరువు/లేపాక్షి/తనకల్లు

ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకూ 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కొత్తచెరువు, లేపాక్షి, తనకల్లు శాఖల గ్రంథాలయాల అధికారులు రమేష్‌నాయక్, మల్లికార్జున, ఎస్.మస్తాన్‌వలి వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. వారోత్సవాల్లో భాగంగా 14వ తేదీ బాలల దినోత్సవం, 15న పుస్తక ప్రదర్శన, 16న గ్రంథాలయ ప్రముఖుల గురించి ప్రసంగం, 17న కవి సమ్మేళన, 18న విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు, 19న మహిళా దినోత్సవం, 20వ తేదీ పోటీల విజేత విద్యార్థులకు బహుమతుల ప్రదానం కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. గ్రంథాలయాలపై అవగాహన, పుస్తక పఠనంపై ఆసక్తి పెంపొందించడమే వారోత్సవాల ముఖ్య ఉద్దేశం అన్నారు. వారోత్సవాల్లో విద్యార్థులు, పాఠకులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-రొద్దం

మండలంలోని సానిపల్లి గ్రామానికి చెందిన కురుబ శ్రీనివాసులు(56) గురువారం ఉదయం గ్రామ సమీపంలోని ఓ చింత చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలిసిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహన్ని పరిశీలించారు. పోస్టుమార్టం కోసం పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయం తెలియడంతో ఎంపీ బికె.పార్థసారథి అల్లుడు శశిభూషణ్ అక్కడికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళుర్పించారు. ఒంటరి జీవితంపై విరక్తి చెంది అతడు ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది.

గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం సభ్యులను సన్మానిస్తున్న ఉద్యోగులు

విఆర్‌ఒల సంఘం ఎన్నిక ఏకగ్రీవం

గోరంట్ల : స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో గురువారం గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పులేరు వీఆర్వో కరణం నాగరాజురావు, ఉపాధ్యక్షులుగా గోరంట్ల సచివాలయం-5 వీఆర్వో లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శిగా మల్లాపల్లి వీఆర్వో పవన్ కుమార్, ట్రెజరర్‌గా కొండాపురం విఆర్‌ఓ ప్రవీణ్ కుమార్, సంయుక్త కార్యదర్శిగా మనసముద్రం విఆర్‌ఓ బి.లక్ష్మీనరసమ్మను ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులను కార్యాలయ సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ మనోహర్ పాల్గొన్నారు.

నేడు కదిరిలో ప్రజాదర్బార్

కదిరి అర్బన్ : మున్సిపాలిటీ పరిధిలోని 11, 13, 14, 15, 16, 17 వార్డుల్లో నెలకొన్న సమస్యలు తెలుసుకోవడానికి శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి నిజాం వలి కాలనీ సచివాల యంలో ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ కార్యాలయ ప్రతినిధులు తెలిపారు. ఆయా వార్డుల కౌన్సిలర్లు, కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని వారు కోరారు. ప్రజలు ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్ అర్జీ జత చేసి సమర్పించాలన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

గాండ్లపెంట : మండలంలోని తుమ్మలబైలు పెద్దతండాలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు దశరథ్‌నాయక్, దామునాయక్, కృష్ణమ్మ, శాంతిభాయ్, సంగీత, పార్వతమ్మ కోరారు. వారు మాట్లా డుతూ గ్రామంలోని ప్రధాన వీధిలో సుమారు 3 నెలల నుంచి తాగునీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఈ వీధిలో రెండు నీటి ట్యాంకులు ఉన్నా పైపులైన్, సప్లై లేకపోవడంతో నీటి ట్యాంకులు నిరుపయోగంగా ఉన్నాయన్నారు. ఈ విషయాన్ని పలుమార్లు సర్పంచి దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా స్థానిక ప్రజాప్రతినిధులు, మండల అధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని, లేనిచో ఎంపిడిఒ కార్యాలయం వద్ద ధర్నా చేస్తామని హెచ్చరించారు.

పరిసరాల పరిశుభ్రతోనే ఆరోగ్యం

పెనుకొండ : పరిసరాల పరిశుభ్రతోనే మెరుగైన ఆరోగ్యం అని పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ పిఒ జయప్ప తెలిపారు. మండలంలోని మంగాపురంలో ఎన్ఎస్ఎస్ యూనిట్-2 ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరం నిర్వహించారు. అందులో భాగంగా మూడో రోజైన గురు వారం ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు గ్రామంలో క్లీన్ డ్రైవ్ చేపట్టారు. నీటి ట్యాంక్ చుట్టూ కలుపు మొక్కలు, చెత్తచెదారం తొలగించారు. దోమ కాటు వల్ల వచ్చే వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. ప్ల కార్డుల చేతపట్టి ర్యాలీ నిర్వహించారు. శుభ్రం చేసిన అంగన్వాడీ సెంటర్, వాటర్ ట్యాంక్ ఆవరణలో బ్లీచింగ్ పౌడర్ చల్లారు. కార్యక్రమంలో అధ్యాపకులు రామన్న, చంద్రమోహన్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

ఉచిత పశువైద్య శిబిరం

ప్రజాశక్తి-తనకల్లు

మండలంలోని ముత్యాలవారిపల్లిలో గురువారం శ్రీసత్యసాయి ట్రస్ట్ సభ్యులు, హైదరాబాద్ నివాసి డాక్టర్ పున్నయ్య సహాయ సహకారాలతో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ రవినాయక్ ఆధ్వర్యంలో పశువులకు అవసరమైన మందులు, మినరల్ మిక్చర్, నట్టల నివారణ మందులను పాడి రైతులకు అందజేశారు. అలాగే గొర్రెలకు నట్టల నివారణ మందులు, పోషక ద్రావణాలు అందజేశారు. శిబిరంలో పశువైద్య సిబ్బంది చిట్టెమ్మ, నాగేశ్వరి, శ్వేత వహన్, పాడి రైతులు పాల్గొన్నారు.

మందులు అందజేస్తున్న వెటర్నరీ డాక్టర్ రవినాయక్

టిడిపి నేత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే పరామర్శ

నల్లచెరువు : టిడిపి మండల సీనియర్ నాయకులు గాలివీటి శ్రీరాములు నాయుడు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. దీంతో ఎమ్మెల్యే పరిటాల సునీత గురువారం మండలంలోని చిన్నఎల్లంపల్లి గ్రామం లోని శ్రీరాములునాయుడు నివాసానికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుమారుడు గాలివీటి కృష్ణమోహన్‌నాయుడు, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

సిసి రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

ముదిగుబ్బ : ముదిగుబ్బ పాత ఊరిలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు శ్రీ కనకదుర్గమ్మ కట్ట నుంచి శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానం వరకు 19 లక్షల పంచాయతీ నిధులతో 15 లక్షలు సీసీ రోడ్డు నిర్మాణానికి,4 లక్షలు 2 కల్వర్ట్ ల నిర్మాణానికి భూమిపూజ ప్రారంబించారు. ఈ కార్యక్రమంలో ముదిగుబ్బ క్లస్టర్ ఇంచార్జ్ తుమ్మల మనోహర్, రమేష్ బాబు, ముదిగుబ్బ సర్పంచ్ లక్ష్మీదేవి చెంద్రాయుడు, స్థానిక తెలుగు దేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసిపి నాయకులకు కేతిరెడ్డి పరామర్శ

ధర్మవరం రూరల్ : పట్టణంలోని పలువురు వైసిపి నాయకులను గురువారం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట రామిరెడ్డి పరామర్శిం చారు. వివిధ కారణాలతో అనారోగ్యంతో బాధపడు తున్న సంజయ్ నగర్‌కు చెందిన అల్లాడి నాగభూ షణం(బుగ్గ), లింగిశెట్టిపాళ్యం వీధికి చెందిన మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ సాయి, 23వ వార్డు ఇన్‌ఛార్జి ఎస్పీ బాషా ఇళ్లకు వెళ్లి పరామర్శించారు.

పరీక్ష కేంద్రం పరిశీలన

రొద్దం : 2025-26 విద్యా సంవత్సరంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలను నిర్వహించేందుకు విద్యా శాఖ అధికారులు కేంద్రాలను పరిశీలిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం జిల్లా ఎసి ఎం.లాజర్, అధికారులు స్థానిక జడ్పీ హైస్కూల్‌ను సందర్శించి వసతులను పరిశీలించారు. ఇందులో భాగంగా గదుల్లో వెలుతురు, ఫ్యాన్లు, లైట్లు, బల్లలు, తాగునీరు, తదితర మౌలిక సదుపాయాలను పరిశీలించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో ముచ్చటిస్తూ పలు సూచనలు చేశారు. వారి వెంట హెచ్ఎం లక్ష్మీనారాయణమ్మ, ఉపాధ్యాయులు ఉన్నారు.

పాఠశాలను పరిశీలిస్తున్న అధికారులు

నేడు టిడిపి నూతన కన్వీనర్ల ప్రమాణస్వీకారం

గుడిబండ/అమరాపురం : నియోజకవర్గంలోని అన్ని మండలాల టిడిపి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, క్లస్టర్, యూనిట్, బూత్ కన్వీనర్లు, కోకన్వీనర్లు, గ్రామ, వార్డు కమిటీ అధ్యక్షులు శుక్రవారం మడకశిర పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రమాణ స్వీకారం చేస్తారని గుడిబండ మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, సింగిల్‌విండో అధ్యక్షులు మద్దనకుంటప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనాథ్, అమరాపురం మండల కన్వీనర్ కృష్ణమూర్తి, సింగిల్‌విండో అధ్యక్షుడు గణేష్ వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ మూర్తి ముఖ్యఅతిథులుగా హాజరవుతారన్నారు. కావున టిడిపి శ్రేణులు పెద్దఎత్తున హాజరై జయప్రదం చేయాలని వారు కోరారు.

మైనార్టీల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

కొత్తచెరువు : మైనార్టీల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని దర్గా కమిటీ మేనేజర్ మాణిక్యం బాబా తెలిపారు. స్థానిక దర్గా కాంప్లెక్స్‌లో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సిఎం చంద్రబాబు మైనార్టీల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. ఇమామ్‌లకు రూ. 10 వేలు, మౌజములకు రూ. 5 వేల వేతనాలు మంజూరు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. హజ్ యాత్రకు వెళ్లే మైనార్టీలకు రూ. లక్ష, మైనార్టీ కార్పొరేషన్ ద్వారా రుణాలు, విద్యార్థులకు స్కాలర్‌షిప్ ఇస్తున్నారన్నారు. షాదీఖానాలు నిర్మించి వాటిని అభివృద్ధి చేశారన్నారు. కార్యక్రమంలో సైకిల్ షాప్ బాబా, రిజ్వాన్, నబి, ఇమామ్, బషీర్, బాషా, తదితరులు పాల్గొన్నారు.

టీచర్లను టెట్ నుంచి మినహాయించాలి

ఓబుళదేవరచెరువు : ఇన్ సర్వీస్ టీచర్లను టెట్ నుంచి మినహాయించేలా చట్ట సవరణ చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ కేంద్ర మంత్రి ధర్మేంద్రప్రధాన్, ప్రధానమంత్రి నరేంద్ర మోడీలకు లేఖ రాసినట్లు డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్(డిటిఎఫ్) కట్టుబడి గౌస్‌లాజమ్ గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ డీఎస్సీ పరీక్ష ద్వారా ఎంపికై 25 ఏళ్ల సర్వీస్ పూర్తి చేసిన వారికి టెట్ పాస్ కావాలని నిబంధన పెట్టడం సరికాదన్నారు. సుప్రీంకోర్టు తీర్పును పున్ఃసమీక్షించాలని కోరారు. ఆయనతో పాటు సోమశేఖర్ నాయక్, వెంకట చలమయ్య, నాగరాజు, తదితరులు ఉన్నారు.

సైన్స్ టూర్‌కి విద్యార్థి ఎంపిక

ధర్మవరం రూరల్ : పట్టణంలోని శాంతినగర్‌లో ఉన్న మున్సిపల్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి సంకరపు గణేష్ గుజరాత్ సైన్స్‌టూర్‌కు ఎంపికయ్యారని హెచ్ఎం ఉమాపతి తెలిపారు. హెచ్ఎం మాట్లాడుతూ ఇటీవల సమగ్ర శిక్ష ప్రాజెక్టు ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో నిర్వహించిన సైన్స్ సెమినార్‌లో గణేష్ అత్యంత ప్రతిభ చూపి తృతీయ స్థానం లో నిలిచాడన్నారు. అతడు డిసెంబర్ 27 నుంచి జనవరి 4వ తేదీ వరకూ గుజరాత్‌లో నిర్వహించే సైన్స్ టూర్‌కి వెళ్తాడని తెలిపారు. గణేష్‌ను హెచ్ఎంతో పాటు సైన్స్ ఉపాధ్యాయురాలు రేఖ, ప్రదీప్‌కుమార్, ఉపాధ్యాయ బృందం, పాఠశాల విద్యా కమిటీ, విద్యార్థులు, తల్లిదండ్రులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

గణేష్‌తో హెచ్ఎం, ఉపాధ్యాయులు

గుండెపోటుతో చేనేత కార్మికుడు మృతి

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన చేనేత కార్మికుడు ఎ.నరేష్(45) గురువారం గుండెపోటుతో మృతి చెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. గార్లదిన్నె మండలం మర్తాడు గ్రామానికి చెందిన నరేష్ పట్టణంలో సొంత మగ్గం నేస్తూ జీవనం కొనసాగించేవాడు. నేసిన చీరలకు గిట్టుబాటు ధర లభించకపోవడంతో సొంత మగ్గాలను విక్రయించి కొద్దిగా అప్పులు తీర్చాడు. ఆ తర్వాత కూలి మగ్గం నేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. ఇంకనూ అప్పులు ఉండటంతో వాటిని ఎలా తీర్చాలో అని మదన పడేవాడు. ఈ క్రమంలో బుధవారం ఛాతిలో నొప్పి రావడంతో నరేష్ ఇంట్లోనే స్పృహ తప్పి పడిపోయాడు. గమనించిన భార్య భాగ్యమ్మ చుట్టుపక్కల వారి సహకారంతో స్థానిక ప్రభుత్వాసుపత్రికి, అక్కడి నుంచి అనంతపురం తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. అతడికి భార్యతో పాటు కుమారుడు పార్థ, కుమార్తె లిఖిత ఉన్నారు. పెద్దదిక్కు మృతి చెందడంతో ఆ కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది.

నరేష్(ఫైల్‌ఫొటో)

ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-గాండ్లపెంట

తిరుపతి శ్రీరమాదేవి మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సహకారంతో సర్పంచి సిఎన్ఎ. సుధాకర్ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని రెక్కమాను చెక్‌పోస్ట్ వద్ద ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు శ్రీనివాసులు, మరో ఇద్దరు వైద్యులు సుమారు 160 మందికి వివిధ పరీక్షలు చేశారు. వారిలో 22 మందికి శస్త్రచికిత్స అవసరమని గుర్తించి వాహనంలో ఉచితంగా తిరుపతికి తీసుకెళ్లారు. వారికి అధునాతన పద్ధతిలో కోత, కుట్టు లేకుండా లేజర్ పద్ధతి ద్వారా ఉచితంగా ఆపరేషన్ చేసి ఆతర్వాత స్వగ్రామంలో దింపుతామని వైద్య బృందం తెలిపింది.

ఫ్రెండ్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-తలుపుల

మండలంలోని భూపతివారిపల్లి, చంద్రనాయక్‌తండా గ్రామాల్లో గురువారం రూరల్ డెవల ప్మెంట్ ఫ్రెండ్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద ప్రజలు, దివ్యాంగులు, వ్యాధిగ్రస్తులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ట్రస్ట్ ఫౌండర్ మన్సూర్ మాట్లాడుతూ చలికాలం దృష్ట్యా ప్రజలు ఇబ్బంది పడకూడదని దుప్పట్లు పంపిణీ చేశామన్నారు. పేదలకు ఎలాంటి సమస్య ఉన్నా తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు ప్రకాష్, వేణు, అంగన్వాడీ టీచర్, ఆశా కార్యకర్త, గ్రామస్తులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలపై నేడు నిరసన

ధర్మవరం రూరల్ : రైతుల సమస్యలపై శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు రైతు సంఘం జిల్లా నాయకులు జంగాలపల్లి పెద్దన్న, సిపిఎం నాయకులు ఎస్‌హెచ్. బాషా తెలిపారు. పట్టణంలో గురువారం వారు మాట్లాడుతూ మొక్కజొన్న పంటకు కనీస గిట్టు బాటు ధర కల్పిం చాలని, పంట సాగు వ్యయం అంద జేయాలని, తదితర సమస్యలను వెంటనే పరిష్కరించా లని డిమాండ్ చేశారు. రైతులు కార్మికులు, రైతు సంఘం నాయకులు హాజరు కావాలని కోరారు. వారితో పాటు రైతు సంఘం మండల కార్యదర్శి మారుతి, రైతులు నారాయణరెడ్డి, శివయ్య ఉన్నారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ

ప్రజాశక్తి- ధర్మవరం రూరల్

పట్టణంలోని ఎరువుల దుకాణాలను గురువారం ఎడిఎ లక్ష్మానాయక్, ఏవో ముస్తఫా తనిఖీ చేశారు. వారు బిసిఎంఎస్ ఎరువుల విక్రయ కేంద్రాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. వారు మాట్లాడుతూ రైతులకు తప్పనిసరిగా రశీదు ఇవ్వాలని, దుకాణం వద్ద ధరల పట్టిక ఏర్పాటు చేయాలని, ఎరువుల ధరలు, స్టాక, తదితర వివరాలు ప్రతిరోజూ అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. రైతులకు విత్తనాలు, ఎరువులు, మందులు ఎంఆర్‌పికే విక్రయించాలని, అధిక ధరకు విక్రయిస్తే కఠిన చర్యలతో పాటు కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎరువుల అమ్మకాలను తప్పనిసరిగా ఐఎఫ్ఎంఎస్‌లో నమోదు చేయాలన్నారు. నిబంధనలు పాటించకపోతే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. వారి వెంట వ్యవసాయ శాఖ సిబ్బంది ఉన్నారు.

పేరుమార్పు / సవరణ

నా కుమారుడు పి. దేశమంతు , S/o పోలగాని బాలకృష్ణ, నివాసం: డోర్.నెం,7-112, మెయిన్ స్ట్రీట్, వీరేపల్లి పేట, వి.టి.సి. పట్నం, శ్రీ సత్యసాయి జిల్లా.
ప్రస్తుతం నా కుమారుడి ఆధార్‌లో అతని పేరు పి. దేసమంతు అని తప్పుగా నమోదు కాబడినది. ఇప్పుడు 10వ తరగతి మార్కుల జాబిత ప్రకారం పేరు మార్పుల జాబితా ప్రకారం పేరు మార్పు చేయగా **పోలగాని జశ్వంత్ యాదవ్**, S/o **పోలగాని బాలకృష్ణ**, **(POLAGANI JASWANTH YADAV, S/o POLAGANI BALAKRISHNA)** గా మార్పు చేయుట జరుగుతుంది. కావున నేటి నుండి నా కుమారుడి పేరు **పోలగాని జశ్వంత్ యాదవ్** గా పిలవబడును. ఆధార్ లో మార్పు కొరకు.

IN THE COURT OF THE PRL. DISTRICT JUDGE, ANANTHAPURAMU
E.P.No.806/2024 in A.C.P (CNICA - FIVE - STAR) No: 377/2023

Between:
M/S. Five Star Business Finance Limited, Chennai Rep. by its Authorized Signatory G.Giddaiah, Kurnool ...**Petitioner/ D.Hr**

V/S

J.DR1: Ankireddy Gari Amaranath Reddy S/O A.V.Ramana Reddy
J.DR2: Ankireddy Gari Syamala W/O Ankireddy Gari Amaranath Reddy
Both are R/at D.No.1-123A, Maruthi Nagar, Nallamada Village & Mandal, Anantapur District, Now Sri Sathyasai District.
.....Respondants/ J.Drs

వేలం ప్రకటన

అర్జీదారుడు EP మొత్తమును రాబట్టుటకు J.Drs కు సంబంధించిన ఈ క్రింది షెడ్యూలు దాఖల ఆస్తిని పై తెలిపిన కోర్టులో వేలమునకు తెచ్చి యున్నారు. వేలములో పాల్గొనదలచిన వారు 17-11-2025వ తేది ఉదయం 10:30 గంటలకు పై కోర్టులో హాజరై కోర్టు షరతులకు లోబడి వేలములో పాల్గొనవచ్చును.

SCHEDULE
The property is situated in RD Hindupur and SRD of Kadiri, within the fields of Nallamada Village Panchayath & Mandal, Anantapur District, Now Sri Sathyasai District
Sy.No:269/7, House No:1-123, Extent:69 Sq.yards, Built:621 Sq. Feet.
Boundaries: East by: Ammulu House, West by: A.Boja Raja Reddy House D.No.1-123A, North by: D.Siva Kesava Reddy Site and South by: Road.
Measurements: East-West: 11.6 feet and North-South: 54 feet Totally measuring-69 Sq yards
DHr Value Rs.5,00,000/-
Ameena Value: 60,00, 000/-

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
M.SURESH KUMAR,
Advocate, Ananthapuramu.
Cell:9441168233